

# ఒక స్వాప్నికుడి డైరీ

— రాణి శివశంకర్

రైలు ప్రవహిస్తోంది, దూరాన్ని వేగంతో కోస్తూ. నేను పోయిన టికెట్టు కోసం వెతుక్కుంటున్నాను. దొరుకుతుందన్న నమ్మకం సన్నగిల్లుతోంది.

విసుగు. ఏ స్టేషన్లో దిగాలో కూడా మరిచిపోయా. మందమరువులోనూ మంచి వుంది పనికిమాలిన మనుషుల్తో ఏం చెయ్యాలో తెలియక చేసిన స్నేహాల్నీ, టెక్స్టుబుక్కుల్లోని అజ్ఞానాన్నీ, ప్రపంచంలోని చెత్తనీ చెదారాన్నీ వ్యర్థంగా గడిపేసి జీవితాన్నీ విసిరిపారేయచ్చు. కానీ అతి ముఖ్యమైన విషయాల్లో మందమరువు నేమనాలి? ఇవ్వాడే స్టేషన్లో దిగాలో ఎవరు చెప్తారు? ఎవరైనా చెప్పినా అది నేను దిగవలసిన స్టేషనని నమ్మకమేమిటి?

బటానీలు నములుతూ చాయి తాగుతున్నాను. ఇదో కాలక్షేపం, స్టేషన్ వచ్చేదాకా. ఏ స్టేషన్? ఎక్కడ దిగినా వొకటే. అంతా విసుపు తెప్పించే ప్రపంచం.

ట్రైనాగంది. ఏ స్టేషన్? ఏదైతేనేం? నేను బైటికి మొహం తిప్పి చూడడానికి కూడా బద్ధకించాను. ఇంతలో వొక అమ్మాయి. నా ఎదురుగా కూర్చుంది. ఆమె చిర్నవ్వుతో చిరపరిచితురాలిగా చెమక్కుమంది. నవ్వు మహిమా అది? ఎప్పుడో ఎక్కడో స్నేహితురాలా? (స్నేహమే సందేహాస్పదం కాని రోజుల్లో) ఇంతకీ ఆమె ఎవరు? సుశీలా! సుజాతా, సరోజా, స్వప్నా? ఎవరైతేనేం?

"బాగున్నారా" ఆ పెదాల కదలిక చాలా ఆత్మీయం. సాధారణమైన ఆకర్షణవల్ల అలా అనిపించిందా? "ఆ... ఇలా వున్నా. మరి మీరు?" సమాధానంగా అదే మొనాలిసా నవ్వు. నవ్వునీ కళ్లలో వెలుగు నీడల్నీ చదవడం ఎంత కష్టం, అందులోనూ నవ్వునొక భాషగా వుపయోగించే వాళ్లదగ్గర.

మా మధ్య నిశ్శబ్దం. మాటలకోసం తపన. చాలా మంది టైపు కొట్టడమంత సులభంగా వాగేస్తారు. తడుముకోరు. అమ్మాయిలతోనైతే చెప్పనక్కర్లేదు. మాట్లాడ్డం కూడా వొక దురద. గోక్కునే కొద్దీ ఇంకా... ఈమెతో అసలేం మాట్లాడాలి? ఎందుకు మాట్లాడాలి? ఎందుకీ ఆదుర్దా, వయస్సా, మనస్సా, కాలక్షేపమా? పరిచితురాలో అపరిచితురాలో తెలీని ఈమెకోసం ఎందుకీ అంతర్లయ? ముందు నిర్ణయించుకోవాలి, ఏ స్టేషన్లో దిగాలో.

నేను ముఖం కిటికీ వైపు తిప్పాను. చెట్లు వెనక్కి పరుగెడ్తున్నాయి. గాలి వురకలేస్తోంది. (మనస్సో?) శూన్యంలో శుష్క మేఘాలు. మేఘాల్లోనూ చిర్నవ్వు మెరుపు. ఆ మెరుపు కర్థమేమిటి? అంత కోమలమైన గూఢమైన దరహాసాన్ని చూసి ఎంత కాలం? వెకిలి నవ్వులు, పలకరింపు తెచ్చుకోలు నవ్వులు, అధికార భయపు కుక్క నవ్వులూ తప్ప. ఈ కల్మషంలో ఫిల్టరైన నవ్వు. ఇంతకీ ఆ దరహాసాల మందారం ఎవరు? సుశీలా, సుజాతా, సరోజా, స్వప్నా? ఎప్పుడెక్కడెలా ఎదురైంది. ఏ స్టేషన్లో? నాలో ఏం రేపింది? శుష్క మేఘాల్లో నీరు నిండుకుంటోందా?

ఆమెవైపు వొకసారి నా చూపుల్ని తిప్పాను. భాషను మించిన సాన్నిహిత్యం మౌనాన్ని కూడా భాషగా మీటుతోంది. ఇప్పుడు బటానీల రొద కూడా శ్రావ్యం. ఆకాశం నీలికళ్లతో కిటికీలోంచి తొంగి చూస్తోంది. ఇంతకీ ఇంత ఆత్మీయమైన ఈమె ఎవరు? పేరేమిటి? వూరేమిటి? ఈ ఏమిటీలను సాగదీస్తే చాలా గోల, కల్మషం, దుర్గంధం. డిగ్రీ ఏమిటి? కులమేమిటి? ఊరేమిటి? వాడేమిటి? తల్లెవరు, తండ్రెవరు; అన్నెవరు, మొగుడెవరు, యముడెవరు? చచ్చు ప్రశ్నలు. సంకెళ్లు.

అలవాటైన మామూలు ప్రశ్నలన్నీ లోలోపలే తెగిపోడంవల్ల నా పెదాలు కదలలేదు. ఆమె సంగతీ అంతేనా?

x x x

నా ముఖం నుంచి పొగ రింగులు రింగులై ఆమె వైపు తరంగించింది. "పొగ. దిక్కుమాలిన పొగ. అందరూ అంతే. చూడండి. ఎంత విలాసంగా వూదుతున్నారో, మీరూ పోటీపడ్తున్నారు వాళ్లతో, ఏముందా పొగలో"

నేనన్నాను విరక్తిగా "ఈ ప్రయాణంలో మాత్రం ఏముంది?"

"ఈ ప్రయాణం మననక్కడికో వొకచోటికి జేరుస్తుంది. గాలీ జేరుస్తుంది. నీరూ జేరుస్తుంది. మరీ పొగ? ఎందుకంత ఆబగా తాగుతారు దాన్ని? పొగతాగి తాగి పొగైపోతారనిపిస్తుంది. ఏం పొందుతున్నారు దాన్నుంచి?"

"ఈ సగరెట్‌ని వూది పారేస్తుంటే, జీవితాన్నే వూదిపారేస్తున్నట్లు. గుండెకు వెచ్చదనం"

"అదో భ్రమ" అని అరిచిందామె. అందరూ ఆమె వైపు.

"గుండెకి అందవలసింది నెత్తురు. వురకలెత్తే వుష్ణ రక్త కాసారం. పొగ కాదు."

"కవిత్వం" అన్నాను నేను పరిహాసంగా.

"ఔను ఏదైనా గాఢంగా చెప్తే కవిత్వమైపోతుంది. గాఢమైంది మాత్రమే జీవితమూ, కవిత్వమూ. పొగలోంచి మాత్రం ఏదీ రాదు. మీరు ఆత్రంగా పీలుస్తారే ఆ వెగటు రసం నుంచీ ఏదీ రాదు. వొక తాత్కాలిక వుద్రేకం, బుడగ. అంతే. నిజమైన ఆత్మీయత, ప్రేమ..."

"అవన్నీ పదాలు. పొగ మాత్రమే నాకు తెలుసు. మా అమ్మ పొగలోనే దగ్గుతూ రొప్పుతూ ముసలైవుడికీ వుడకని అన్నం తిని అసంతృప్తితో చచ్చిపోయింది. ఆమె జీవితం నిండా పొగే. గోడలూ పొగే, నీడలూ పొగే??

"మీరు ఆ పొగనే తెలిసి తెలిసే తాగుతున్నారు. ఆబగా భ్రమని వర్షించని మేఘాన్ని."

శూన్యంలో శుష్క మేఘాలు కదుల్తున్నాయి.

## కిటికీ

తెల్లారక తెల్లారక తెల్లారక
వెల్లవేసిన గోడలో పాతుకుపోయిన కిటికీ
కనుకొత్తగా కనిపిస్తుంది.
చీకటి గజాల భుజాల మీద చేతులేసి
జాగరం చేసిన కిటికీ కళ్లు
ఎరుపెరుపెరుపెక్కాయి,
గాలీ వీచీ వానావచ్చీ
మంచూ పట్టీ, పాగా పుట్టీ
రాత్రి గడిచాక
ఓ వెలుగు కిరణాన్ని
కిచకిచల పట్టెను చేసి
నా పైకి పంపుతుంది కిటికీ
వస్తున్న మెలకువను కాదంటూ
ఇంకా నిద్రలేవని నాకై
ప్రభాతాన్ని పూల పొట్లాంజేసి
ఎదురుచూస్తుంటుంది కిటికీ
నొప్పులతో మెలిలిరుగుతూ
కణకణ కవలేక కనలేక
నా బంగారు తల్లి పిడికెడు ఆత్మా
పిచ్చుకైవాలిందీ కిటికీ రెక్కపైనే
ఒంటరిగా ఏడ్చే నన్ను చూసి
ఆకాశపు వీలి బుడగను
ఆప్యాయంగా చేతికిచ్చి
అమ్మంత విశాలమై
నన్ను ఓదార్చిందీ కిటికీయే!
వయసు ఊచలు
నాలుగు వూడీ
రెండు మిగిలీ
తెగిన తీగల ఒంటరి కిటికీ సితారును
వొణుకుతూ మీటుతున్నప్పుడు
చేయందించిన నన్ను
చేతివేళ్ల కనుస్పర్శతో తడిమి
మనసులోనే దీవించిన
నాయనమ్మ తడిరెప్పల కన్ను ఈ కిటికీ
సగం చచ్చీ సగం బతికీ
అవిరౌతున్న జీవితం
రెప్పల మధ్య ఓ పురా జ్ఞాపకపు
కన్నీటి బిందువై నిలిచినప్పుడు
మనిషి ముఖచిత్రం చుట్టూ
నలుచదరపు చట్రమై
బిగుసుకుందీ కిటికీయే! — రాం

మెరుపులూ పురుములూ చినుకులూ లేని మేఘాలు.

x x x

"అడవి మొదలైంది" అందామె. అవును, అడవి, దట్టమైన అడవి. సరిగమల్లా పక్షుల రెక్కల వ్వాదు వైన కదలికలు. చెట్లూపొదలూ ఆకాశం వొంగినంతవరకూ.

చిన్నతనంలో అమ్మతో నడచిపోతూంటే, ఎటు చూసినా కొబ్బరి చెట్లు, పచ్చని పంట పొలాలు, అమ్మలాంటి చల్లనిగాలి. "ఈ తోట కవతల ఏముంటుంది? ఈ చెట్లకు అంతే వుండదా" అని అనుమానమొచ్చేది. అమ్మని అడుగుదామంటే ఈ గందరగోళపు ప్రశ్నలకి భాష అందేది కాదు. తర్వాత చెట్లే అపురూపమైన నగరంలో వున్నపుడు, ఎక్కడైనా చల్లని నీడ తగిల్తే చాలు మా వూరు స్ఫురించేది. ఆమె పరవశంగా "ఈ చెట్లని చూస్తుంటే కిటికీలోంచి దూకెయ్యాలనిపిస్తోంది. సోమరి నీడలు వేలమీదికి మబ్బులు వాలినట్లు, నిద్రపోతున్న ఏనుగుల్లా కొండలూ, బలే బలే" ఆమె ముంగురులతోను చీరతోను ఆడుకొంటోంది గాలి.

"యహ్ కౌన్ చిత్రకార్ హై కౌన్ చిత్రకార్' అని ఆలపిస్తోందామె మధురంగా. మా కలల్ని చెదరగొడ్తూ తోటి ప్రయాణికుల సంభాషణ.

చుట్టవైపు సిగరెట్ యూవగింపుగా చూసింది. చుట్టని ఆర్పి చెవిలో పెట్టుకొన్నాడు. "ఆ వెధవ చుట్టని విసిరేయకూడదా?" అంది సిగరెట్ వెలిగించుకున్న ముఖం. "సొంతం కాల్చకుండా ఎలా పడెయ్యను బాబూ. మేం మీలా దొరబాబులం కాదు. రెండు తూర్లు కాల్చుకొంటా" "నీలాంటాళ్లు ఎడ్లబండిలో పోవాలి. ఛీ రిజర్వేషన్ దొరక్క ఈ పాట్లు. వెధవ గేంగ్. చెత్తా చెదారమంతా జేరుతుంది. దేశం బాగుపడాలంటే వీళ్ళందర్నీ స్మేష్ చేసెయ్యాలి" చేపల బుట్టల్తో జేరిన జనాన్ని కూడా అసహ్యంగా చూస్తూ.

x x x

"చూడండి ఎంత అద్భుతమైన నాట్యమో. ఆహా ఏం రాజసం, ఏం ఠీవి, ఏం పొందిక ఆ కదలికల్లో" ఒక తన్మయుడు వర్ణిస్తున్నాడు.

వొకడు గంతుతున్నాడు. హస్తాల్ని చాలా వేగంగా కదిలిస్తూ. నాచుపట్టిన సరస్సులా వున్నాడు. "అది పచ్చని గజ్జి. స్పీడుగా గోక్కుంటుంటే నాట్యమనే భ్రమ. అంతే"

అతడు నావైపు గిరుక్కున తిరిగి "గజ్జి అని చులకనగా మాట్లాడ్తావేం? లోకంలో వెయ్యి రకాలుండచ్చు. ఐనా అన్నిటికన్నా మా గజ్జే శ్రేష్ఠం. అందుకే మాకింత ఠీవి, రాజసం. నీకేముంది?" గజ్జి మందుకి పబ్లిసిటీ అవసరం కాని, గజ్జికెంటుకో నాకర్థం కాలేదు.

మళ్లీ గోకుడు. మిగిలిన వాళ్లకి కూడా ఈ గోకుడు రోగం అబ్బినట్లు నేను గమనించాను. అందరికీ రకరకాల వర్ణల గజ్జి. నాకు కూడా దురదపుడ్తోందా? "ఇదంతా విసువు పుట్టిస్తోంది" అన్నాను నేను.

"అలా వారసంగా వచ్చిన గజ్జిని గోక్కుని రాచపుండో బ్రహ్మరాక్షసో చేస్తారు" అందామె.

"80 ఏళ్లొచ్చినా మా తాత వెంట అమ్మాయిలు ఎగబడేవారు. ఆయన వీపు గోకేవారు. అమ్మాయిల నడుం పట్టుకొని డేన్స్ చేస్తూ చేస్తూ విలాసంగా రాజకీయాల్లోకి వెళ్లి అక్కడా గొప్పగా నటించేశాడు. అసలా ఠీవి రాజసం..." భూమి వీపు గోకుతున్న సుదీర్ఘ హస్తంలా, రైలు సర్రున పోతోంది నానా చెత్తని మోస్తూ.

x x x

"మావయ్య అనే గౌరవం కూడా లేదురా? లక్ష రూపాయలకి వొప్పేసుకోరా, నువ్వు నా మాట వింటావని కదా వచ్చింది."

"ఇవాళ అవసరం వచ్చింది కనుక ఈ చుట్టరికాలన్నీ గుర్తొచ్చాయి. ఇంతకుముందెప్పుడైనా నన్ను చూడడానికి వచ్చావా? ఎక్కడైనా బావంటే వని వంగ తోటలో బావ కాదు"

"ఈ బేరమేమిటో, ఎందుకో" అని ఆలోచిస్తున్నాను.

"ఐతే ఎంతకి వొప్పుకుంటావో చెప్పు" పెద్దమనిషి.

"ఇందాకట్నుంచి చెప్తున్నాను కదా లక్ష రూపాయలు, 50 గజాలు."

"అన్ని గజాలెక్కడ్నుంచి తీసుకురాన్రా. ఆఫ్రికా అడవులకి పరిగెత్తమంటావా?"

"కుళ్లు జోకులొద్దు మావయ్యా. నేను ఇళ్ళ స్థలం గురించి మాట్లడ్తున్నా."

"అంత ఇచ్చుకోలేన్రా"

"ఐతే వేరే సంబంధం చూస్కో. అసలు నాకు అమ్మాయి నచ్చలేదు. అడిగినంత ఇస్తే రాజీపడదామనుకొన్నానంతే."

"కావలసిన సంబంధం కాలదన్నకురా."

సంబంధం అంటే ఏమిటి? ఏం సంబంధం? ఎందుకు సంబంధం?

"అసలు వీణ్ణి రేపు పాతిపెట్టడానికి ఎన్ని గజాల నేల కావాలి" అందామె తీవ్రమైన ఏవగింపు స్వరంలో. క్షయ క్రిములు వ్యాపించినట్లు రైలు ఖణ్ ఖణ్‌మని దగ్గుతూ పరిగెడ్తోంది.

"మా నాయన వ్యాపారంలో దివాళా తీశాడు లేకపోతే రెండు లక్షలు కట్నం ఇచ్చి ఏ మంచి వ్యాపారికో, ఇంజనీరుకో, డాక్టరుకో ఇచ్చి పెళ్లి చేసేవాడు. మనమొకటి తలిస్తే దేవుడొకటి తలుస్తాడు. చివరికీ టీచర్ చేతిలో పడ్డా. ఖర్మ."

"టీచరైతే నష్టమేమిటి? సంతృప్తి వుండాలి. పెళ్లిళ్లు నరకంలో జరుగుతాయి. మన ఇష్టమా?" తర్వాత వారి సంభాషణ చీరల మీదికి, పెళ్లిళ్లు, బారసాలలు వగైరా తంతుల మీదికి పోయింది. ఆమె విసుగ్గా ఏవగింపుగా అంది...

"ఈ గోలకి ఫుల్‌స్టాఫ్ ఎక్కడ? స్త్రీల కోసం చీరలూ నెక్లెస్‌లూ తయారుచేసి అమ్మినట్లుగానే, వారి సంభాషణల్ని కూడా మగాళ్లే తయారుచేసి అమ్ముతారు. వాటిని తగిలించుకొని మురిసిపో

## జంటస్వరజతి

వేదిక ఉదధిమీద గాయకుల
గాత్రనాదాలే లయకేతనాలు
షేర్వాణీలు, కుచ్చు టోపీలు
నియోన్‌కాంతికి వినూత్న అలంకారాలు
ఆ వృత్తాల చమ్కీలతో జలతారంచుల గమకాలతో
గాలికి లేచే మధుర జంటస్వరజతులే
అగరుధూప పరిమళాలు
మెలికలు తిరుగుతూ పోయే పాటకు
సహకార గాత్ర ప్రకంపనల తరంగాలు
ప్రశ్నలే పల్లవులయితే జవాబులే అనుపల్లవులు
శ్రోతల మనసుల్ని దూరతీరాలకు
ఎగరేసుకుపోయే
పాట తరగే ఓ మబ్బు తునక!
మంచు పేరుకొని మత్తుగా జోగుతున్న చీకటి
వీధులకు
విద్యుద్ఘాతాన్ని కలిగించే చైతన్య జ్వలత్
జ్వాలాతోరణాలూ
ఒక్కసారిగా భళ్ళుమనే 'వహ్వా' శబ్దాలు,
మోదాట్ట హాసాలు,
అంతవరకు అచేతనంగా పడివున్న చేతుల
హఠాత్ కరతాళధ్వనులు!

—శశికాంత్ శాతకర్ణి

తుంటారు కేసు బొమ్మలు. విదేశాల్లో పురుషుల లైంగికానందం కోసం బొమ్మలు కూడా తయారు చేస్తున్నారట. బొమ్మలు, జీవం లేని బొమ్మలు ఛీ ఛీ..." ఆమె ధిక్కారం జుగుప్సా మిళితమైన కంఠస్వరం భయపెట్టాయి. అది కొత్త స్వరం.

ఇటీవల మా నాయన ఒక ఉత్తరం రాశాడు. అణకువ, వినయం కలిగిన అమ్మాయిని చూశానని, పెళ్లి చేసుకుంటే వృద్ధులైన తమకీ నాకు కూడా మంచిదని. అసలు నా అంతరంగపు లోతుల్లోని పురాతన స్త్రీ చిత్రం ఇంకా చెరిగిపోలేదా? అందుకే ఈ అలజడా, కొత్త గాలులకి.

x x x

లేగదూడ ఆనందంగా పచ్చికపై గంతుతోంది, బాల్యస్మృతులతో బాటు ఎవరో తలపాగా చుట్టిన మనిషి.. "ఎల్లయ్యా!" అని పిలిచాను.

ఆమె నా వైపు వింతగా చూస్తూ "ఎల్లయ్య ఎవరు!"

ఎల్లయ్య పెంచే లేగదూడ ఎంత హుషారుగా గంతేది, చెంగు చెంగున, అక్కయ్యా అంతే. అందమైన అంచుల పరికిణీకి ఎంత చెలాకీ. మా దొడ్లో బంతిపూలు ఆనందం పట్టలేక పక్కున విచ్చుకొనేవి. అక్కయ్య పరికిణీ వీణని మీటేది. ఏమయ్యాయి ముత్యాలమ్మా (మా వూరి అమ్మవారు) ఆ ఆనందం, ఆ బాల్యం, ఆ రంగుల అంచులూ? ఎల్లయ్య లేగదూడ చచ్చిపోయింది. వాడి కొడుకు తప్పతాగి కాలవలో కొట్టుకుపో ... . అక్కయ్యకి పిచ్చెక్కిపోయింది. బంతులు వాడి రాలిపోయాయి. కాలవలో విషాదం ప్రవహిస్తోంది. చెట్ల నుంచి విషాదం రెక్కలు కట్టుకొని ఎగురుతోంది. ఇంతకీ ఈమె ఎవరు? అక్కయ్య కాదు కదా? అక్కయ్య మామూలు మనిషైపోయిందా? దేవతలు కరుణించి? అసలు పిచ్చంటే ఏమిటి? పెళ్లా, కుటుంబమా?

లేగదూడ హుషారుగా గంతుతూ పచ్చికబయలు మీంచి రోడ్డు మీదికి పోతోంది. రకరకాల వాహనాలు చక్రాల్తో పగబడ్తూ. ఫ్యాక్టరీల్లోని మరలు కూడా తోడయ్యాయి. లేగదూడ, వెనక ఇంకా బాల్యపు ఉత్సాహం పిప్పికాని అక్కయ్య. "పట్టుకో ఎల్లయ్యా. పిచ్చెక్కిన రోడ్డు. ఎల్లయ్యా అవు ఎల్లయ్యా వాళ్లని."

"ఏమిటి పలవరిస్తున్నారు?" గట్టిగా పిలుస్తూ నిద్రలేపిందామె. కళ్లు తెరిచి ఆమెవైపు చూశాను. పీడకల వెలిసింది.

x x x

"కువైట్‌లో ఇంజనీర్‌గా పనిచేసేవాడిని యుద్ధం ఊడ్చితంతే ఎడారుల్లోంచి దొర్లుకుంటూ ఇక్కడికి వచ్చి పడ్డాను" అన్నాడతడు. గడ్డం రెల్లుదుబ్బు. కళ్ల గుంటలు. నీరసమైన కంఠస్వరం. చచ్చిపోతున్న వుత్సాహానికి సెలైనెక్కిస్తున్నట్లు మద్యాన్ని గడగడా తాగుతున్నాడు.

ఇంతకీ ఇతడెవరు? నాగరత్నం భర్త కాదుకదా? మిత్రురాలు నాగరత్నం కోనసీమలోని వొక మారుమూల పల్లెలో. భర్త సుదూర దేశంలో జీవితానికి చమురుకోసం. నిరీక్షణే ఆమె జీవితం. అతనెలాగూ రాడు. డబ్బు వస్తుంది. ఏ పరిమళాన్నీ వెదజల్లలేని వెధవ డబ్బు.

ఇంతకీ ఇతనేనా? ఐనా ఇప్పడామె గుర్తించగలదా, దివాళాతీసి జీవం చచ్చి కళాకాంతులుడిగిన ఈ కళేబరాన్ని. ఇంతకీ ఈమె ఎవరు? సుశీలా, సుజాతా, సరోజా, నాగరత్నం?

x x x

"అసలీ ట్రైన్ ఎక్కడికి?" ఆమెవైపు నేను ప్రశ్నార్థకంగా చూశాను.

"స్వప్నాల్లోంచి స్వప్నాల్లోకి పోతూంది రైలు. చివరికి అద్భుతమైన స్వప్నం లోకి తెగుతుంది" కవి.

x x x

ఆమె ముఖం నుంచి వెన్నెల మంచులా కురుస్తోంది. ప్రకృతంతా అదృశ్యంగా వుష్పించింది. ఆమె సాన్నిహిత్యంలో ఎంతో సన్నిహితంగా కనిపిస్తోంది ప్రతిదీ. రైలు చేసే ధ్వని కూడా సంగీతం లాగే వుంది.

సైగల్ పాట గొంతునొక్కి టేప్‌రికార్డర్ని బీరువాలో భద్రపరచిన వదినకీ ఈమెకీ ఎంత తేడా? ఆ ఇంట్లో నిరుద్యోగిగా గడిపిన కొన్ని రోజులూ శూన్యంలో వేళ్లాడుతున్నట్లుండేది.

అసలీ అపరిచిత పరిచిత ఎవరు? సుశీలా సుజాతా సరోజా చంద్రికా?

(వొకొక్కసారి కలలు కూడా వాస్తవమంత సన్నిహితంగా కనిపిస్తాయి. వీణని మీటుతూ చిరునవ్వుతూ అద్భుతంగా ఆలాపిస్తోంది వొక సుందరి. ఎవరీమె అని ప్రశ్నించుకొంటున్నాను. ఇంతలో అమ్మ నిద్ర లేపింది. కిటికీ సూర్యుణ్ణి చిగిర్చింది. రేడియోలోంచి అదే పాట ఇంకా ప్రవహిస్తోంది. ఇంతకీ పాటకు పరవశించిన నిద్రకు వొక సుందర రూపాన్ని స్వయంగా పల్లవించిందన్నమాట.)

ఇంతలో ఆకాశమంతా దిగులుగా మబ్బులు. చంద్రుడూ లేడు. నక్షత్రాలూ లేవు. వొకటే చీకటి. మెరుపు వెలుగులో కొండలూ, గుట్టలూ, చెట్లూ, పెద్ద పెద్ద భాండాలు బద్ధలౌతున్నట్లు ఉరుములు. చినుకులు సూదుల్లా. పాములా పాకుతోంది నీరు. ఆమె కనురేకుల్ని విరిసింది. ట్రైనాగింది.

"దిగాలిక" అంది.

"పగబట్టిన వాతావరణంలో ఎలా?"

"స్టేషన్ వచ్చేసింది మరి"

"కావచ్చు కాని వొక్కరూ..."

"ఎవరో వొకరు ఎదురు చూస్తూంటారు. పోనీ మీరు..."

నాలోంచి దుర్గాపురంరోడ్, దుర్గాపురంరోడ్ దేవదాసు రైలు దిగాడా? నేనే దేవదాసునా? మరి పార్వతి ఎవరు? ఎక్కడ తప్పిపోయింది, ఏ స్టేషన్లో? కొంపముంచి ఈమె కాదుకదా? అసలీమె ఎవరు? సుశీలా సుజాతా సరోజా పార్వతా వొఫీలియావా కలా మెలకువా?

"మీరు దిగవలసిన స్టేషన్ ఈ ఆకాశం కిందేనా?" ప్రశ్నిస్తోందామె. ఎలా చెప్పను? అదే తెలిస్తే ఎందుకీ నిరీక్షణ? ఆ వురుములూ మెరుపులూ నన్నే పిలుస్తున్నాయా? అసలు వర్షం నాలోనే కురుస్తోందా, చిగిరించడానికి.

ఐనా ఎక్కడ్నుంచి ఆమెకీ ధైర్య? ఈ వురిమే మెరిసే ఆకాశం నుంచా? నిర్విరామంగా పిడుగుల్ని వర్షిస్తున్న ఆకాశం కింద ఎవరో శిఖరమై తుపాకీ మెనలాంటి చూపుల్తో ఎదురుచూస్తూంటారనే ఆమె ఆశ ఆశ్చర్యం ఈర్ష్య కల్గించింది. కాని అద్భుతమైన ఆ విశ్వాసం నాలోకి పాకి నా సంకెళ్లు తెంచి నా కాళ్లను కర్తవ్యం వైపు కదిలిస్తుందనే విశ్వాసం. బైటికి చూశాను. మెరుపు వెలుగులో చెట్లూ పుట్టలూ కొండలూ గుట్టలూ అన్నీ రహస్య నేత్రాల్తో పిలుస్తున్నట్లే అనిపించింది. ఆకాశం మెరుపుల కొరడాల్తో భూమిని భవిష్యత్ స్వప్నంలోకి నడిపిస్తోంది.

ఆ స్వప్నం ఈమె కాదు కదా? భయంకరమైన ఈ అర్థరాత్రి ధైర్యం విశ్వాసం తప్ప ఏ లగేజీ లేకుండా ప్రపంచంలోకి విచ్చుకొంటున్న ఈ ధీరురాలు, నేను దిగవలసిన స్టేషన్ యీమేనా? ◆